# గుడ్డిదీపం

ఊరవతల మర్రిచెట్టు జడలు విరబోసుకుని కూర్చున్న పిశాచిలా ఉంది. దాని సేవకురాలిలా ఆ చెట్టుక్రింద కూర్చొని ఉంది ఒక ముసలిది. ముసలిదాని ముందు ఒక ఖాళీ సత్తు పాత్ర, ఓ సత్తు గ్లాసు ఉన్నాయి. ప్రక్కనే నాలుగు అడుగులు పొడవున్న కర్ర ఉంది. చెట్టు తొర్రలో పాత గుడ్డల మూట ఉంది. ఆ ప్రక్కనే చుట్టి ఉన్న ఓ చింకి చాప ఉంది. అ ముసలిదాని ఆస్తి అది. ఆ ముసలిదాని నివాసమది.

బయట ఎండ మండిపోతూ ఉంది. ముసలిదానికి కడుపులో అన్నం లేదు. కాళ్ళలో శక్తిలేదు. అంతకు మించి అడుక్కోవడానికి ఓపికలేదు

ఉన్నట్లుండి శక్తినంతా కూడదీసుకొని ముసలిది లేచి నిలబడింది. ఒక చేత్తో సత్తుగిన్నె, సత్తుగ్లాసు పట్టుకొంది. మరో చేత్తో కర్ర పట్టుకొంది. ఊరు అక్కడికి కూతవేటు దూరంలో ఉంది. అక్కడికి మరో కూతవేటు దూరంలో ఉంది గూడెం.

శక్తిలేని కాళ్ళు కదలనని మొరాయిస్తుంటే బలవంతంగా అడుగులు వేస్తోంది. కాని అది ఎంతోసేపు నిలవలేదు. ఒక్కో అడుగువేస్తూ చెట్టుదాటి పదడుగులు వేసింది. కాలు ఒక రాయిని తట్టుకొని ముసలిది బోర్లా పడిపోయింది. సత్తుగిన్నె, గ్లాసు అంత దూరంలో పడిపోయాయి. కర్ర అందనంతదూరంలో ఎగిరిపడింది.

పైన ఎండ. క్రింద దుమ్ము. లేచే ఓపికలేనట్లు ఆ వేడి దుమ్ములో అలాగే ఉండిపోయింది. తన ప్రస్తుత పరిస్థితి గుర్తొచ్చి కుళ్ళి కుళ్ళి ఏడవసాగింది ముసలిది.

• • • •

సాయమ్మ చిన్నప్పటి నుంచీ కష్టజీవి ఒక్క క్షణం ఊరుకోదు. ఎప్పుడూ ఏదో పని చేస్తూ ఉండాల్సిందే. భర్త చనిపోయి కొడుకు పంచన చేరి కాలం వెళ్ళబుచ్చుతున్నా ఊరికే ఉండేదికాదు. అడవికి వెళ్ళి చిదుగులు ఏరుకురావడం, పిడకలు తట్టడం చేస్తూ ఉండేది. కాని కాలం గడిచేకొద్దీ వయసు మీరింది. కళ్ళు సరిగా కనపడడం లేదు. చెవులు సరిగ్గా వినపడడం లేదు. ఇక ఆ పరిస్థితుల్లో ఏ పనీ చేయలేక పిల్లల్ని ఆడిస్తూ కాలం గడపసాగింది. అయితే రోజు రోజుకూ కోడలు గద్దింపులు ఎక్కువ కాసాగాయి. అయినా సాయమ్మ బాధపడేదికాదు. కొడుకన్నా కోడలన్నా అంత అభిమానం ఆమెకు. మనవళ్ళన్నా, మనవరాండ్రన్నా అంత అపేక్ష.

ఆ మధ్యాహ్నం గుడిసె ముందు వేపచెట్టు క్రింద కూర్చొని ఉంది సాయమ్మ. కూలి నుంచి వచ్చిన కోడలు చుక్కమ్మ గుడిసెలో గంజి కాస్తూ ఉంది.

"బిడ్డనేంది ఎండలో అట్టా పడేసినవు ఎత్తుకో ఇనపట్టంలా" అరచింది చుక్కమ్మ గుడిశెలోంచి తొంగిచూసి.

"ఇనపడతుందిగాని కనపట్టంలేదే. కనపడితే నాకేటన్నా సోగురా ఏంది" ముసలి సాయమ్మ తడుముకొంటూ వేపచెట్టు మొదటి నుంచి లేచింది.

"అవును. కనపడదుగాని ఏళకి ఆకలి పుడతది. అది మాత్రరం నిజెం."

"ఏందే. అట్టా అంటవు. నాను మాత్తరం మడిసినిగాదేంటి" కర్ర తట్టుకుంటూ మసక మసక చూపుల్తో పరకాయించి చూసింది.

గుడిసె ముందు పది నెలల బిడ్డ చేతకాని పాము పిల్లలా పాకుతోంది.

"కర్రి ముండ. నా బంగారు బుడ్డి" దగ్గరకొచ్చి చేతుల్లోకి తీసుకొంది.

"ఇంతకీ పిలగాళ్ళంతా ఎట్టా బోయిన్రనే అమ్మీ!"

"అళ్ళు కాళ్ళొచ్చినోళ్ళు. ఏడ ఆడుకొంటున్రో పిచ్చి నాయన్లు" మురిసిపోతూ అంది చుక్కమ్మ తన అయిదుగురు పిల్లల్ని తలచుకొని.

సాయమ్మ మారు మాట్లాడకుండా బిడ్డను చంకనేసుకొని వేప చెట్టు మొదలు దగ్గరికి నడిచింది. బిడ్డ కేకలు పెట్టి ఏడుస్తూనే వుంది.

"ఓరినాయమ్మ. ఓరినాయమ్మ ఏడవకే" జో కొడుతూ వేపచెట్టు నానుకొని కూర్చొంది సాయమ్మ. కోడలు ప్రవర్తన రోజు రోజుకూ కంటక ప్రాయంగా ఉంది ఆమెకు.

మనవళ్ళను, మనవరాండ్రనూ చూసుకొంటూ, పరలోకంలో ఉన్న భర్తను తలచుకుంటూ రోజులు గడుపుతూ వుంది సాయమ్మ.

రాత్రి గుడిసె బయట కుక్కిమంచంలో కూరుకుపోయి ఉంది సాయమ్మ. వెన్నెల విరగకాస్తూ ఉంది. 'నాజలము ఇట్టాగే కట్టంలేకుండా గడిపెయ్ సామీ' అనుకొంది మనసులో.

ఇంతలో గుడిసెలోంచి మాటలు పెద్దగా వినిపించాయి.

"అయితే ఏంది మావా నువు సెప్పేది. సచ్చేదాకా ఈ ముసిలి దాన్ని ఎట్టా సాకతవు."

"ఎట్టాగైనా సాకాల్నే సుక్కా. కన్న తల్లి గదా తప్పుద్దా."

"అయితే నానూ, నా పిల్లలూ నాసినమయిపోవాల్సిందేనా?"

"అదేంటే అట్టంటవు. నేనేమంటినని."

"ఏమనక పోయినా తెలుసుగదా. ఒక ముసలిదాన్ని తేరంగా కూసోపెట్టి సాకాలంటే ఎంత కర్సవుద్దో."

"సరేనే. నన్నేం సెయ్యమంటవ్?"

"నేను సెప్పింది సేస్తనని మాటియ్. అనక సెప్తా."

"సరే మాటిచ్చినా. సెప్పు."

"మరి తప్పవు గదా?"

"తప్పనంటే తప్పను."

"అయితే రేపే మీ యమ్మను ఇంట్లోనించి ఎళ్ళిపొమ్మను."

వింటున్న సాయమ్మ గుండె ఆగిపోయినట్లయింది. 'నా నిప్పుడు దేవున్ని కోరిందేంది. జరగబోయేదేంది' అనుకొంది భయం భయంగా.

"ఒసే ఇది గోరమే అన్నాయమే. ఆ ముసిల్ది ఎట్ట బతకద్దే. గుడ్డిది ఏడన్నా బడి సస్తదే" బలబలబలాడుతున్నాడు కొడుకు నాగయ్య.

"మాట తప్పుతవన్నమాట. ముందు నా మీద సెయితియ్" అరచింది చుక్కమ్మ.

కొద్దిసేపు మౌనంగా ఉన్నారు.

"ఇది అన్నాయం కదంటే. నాకు పాపం సుట్టుకొంటదే."

"ఏం గాదు. నా బిడ్డలు బాగుపడకపోతే నాకు సుట్టుకొంటది పాపం. నా మాటిను. అందరూ బాగుపడతుండరు. మనమే ఎనక బడుందేది. మీ యమ్మ ఊళ్ళో అడుక్కొనయినా బతకద్దిలే."

నాగయ్య ఏమీ మాట్లాడలేదు. కొద్దిసేపటికి చుక్కమ్మ ఏడుపు, వెక్కిళ్ళు, ముక్కు ఎగబీల్చడం వినిపించాయి.

నాగయ్య కరిగిపోయాడు. "సరేలేయే ఏడవమాకు. రేపు ఎట్నో మా అమ్మను ఒప్పించి ఇంట్లోనించి పంపిస్తన్లే" హామీ ఇచ్చాడు నాగయ్య.

చిలకలా నవ్వింది చుక్కమ్మ. ఇద్దరి సకిలింతలు, ఇకిలింతలు.

సాయమ్మ కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. మొగుడు పోయినరోజు గుండెలు తెగేట్లు ఏడ్చింది .మళ్ళీ ఇప్పుడు. రేపట్నుంచి ఎట్లా బ్రతకాల్నా అనే దిగులు, కొడుకు, కోడలూ ఈ నిర్ణయానికి ఎందుకు వచ్చారా అనే బాధ ఆమెను రాత్రంతా నిద్రపోనివ్వలేదు.

తను కొడుకును చిన్న తనం నుంచి ఎంత జాగ్రత్తగా సాకింది. వాడు బడికెళ్ళి మధ్యాహ్నం కూటికి రాకపోతే కూడు బడికే తీసకపోయేది. చెరువుల్లో ఈతకొట్టను, తోపుల్లో కాయలు కోయను పోతే వాడి కోసం చెరువులన్నీ వెతికేది. తోపులన్నీ గాలించేది.

ఒక రాత్రి వాడికి గుణం తగిలి విరుచుకు పడిపోయాడు. ఊళ్ళో వాళ్ళు చుట్టతో ముఖాన కాల్చబోతే భయపడి అక్కడ్నుంచి మూడుమైళ్ళ దూరంలో ఉన్న టౌనుకు బయలుదేరింది.

చిక్కటి చీకటి. దారంతా అడవి. భర్త ఒళ్ళంతా దుప్పటి కప్పు కొని లాంతరు చేత బట్టుకొని ముందు నడుస్తూ ఉంటే వెనక నోట్లో చొంగ కారుస్తూ, బిర్ర బిగుసుకుపోయిన పదేళ్ళ నాగయ్యను భుజాన వేసుకొని ఏడుస్తూ తను వెల్తూ ఉంది. ఒకరి కొకరు ధైర్యం చెప్పుకొంటూ భార్యా భర్తలు ఆ అర్ధరాత్రి టౌను చేరి, రామాచారిని లేపి వైద్యం చేయించారు

ఆ రాత్రి తెల్లవార్లూ ఏడుస్తూనే ఉంది సాయమ్మ. తెల్లవారి ఆరోగ్యంగా ఉన్న బిడ్డకు ముఖం కడిగించింది. ఈ లోపల సాయమ్మ భర్త బాలయ్య హోటలు కెళ్ళి వేడి వేడి ఇడ్లీ పట్టుకొచ్చాడు. బిడ్డకు కడుపు నిండా పెట్టి మిగిలింది భార్యాభర్తలు తిన్నారు.

కొడుకు విషయంలో ఇలాంటి వెన్నో ఇక బోతే కోడలు సంగతి.

పొడగరి. ఎత్తయిన ఎద, ఛామన ఛాయ. పని పాటలు తెలిసిన పిల్ల చుక్కమ్మ. ఆ చుక్కమ్మనే పెళ్ళి చేసుకొంటానని కూర్చున్నాడు నాగయ్య. చుక్కమ్మ చూపు చూస్తే చాలు పడి చస్తామంటారు గూడెంలో వాళ్ళు. అంత అందగత్తె గూడెంలో ఆ పిల్ల.

సాయమ్మ తన తమ్ముడి కూతురు మీరమ్మను చేసుకోమని నాగయ్యకు నచ్చచెప్పింది. ససేమిరా ఒప్పుకోలేదు నాగయ్య. ఇదిలా ఉండగా చుక్కమ్మ తండ్రి కొండయ్య వచ్చి 'సుక్క నాగడ్ని తప్ప ఇంకెవర్నీ సేసుకోనని కూసొంది' అని చెప్పాడు. సాయమ్మ తమకు తన మేనకోడలుందని చెప్పింది.

ఒక రోజు సాయంత్రం సాయమ్మ బర్రెదూడను గుంజకు కట్టేస్తూ ఉంది.

ఆమె వెనకనే గుడిసెలోకి దూరింది చుక్కమ్మ. సాయమ్మను వాటేసుకొని వలవలా ఏడ్చింది. "అత్తా నేను నాగయ్య మామను తప్ప ఏరే వాళ్ళను సేసుకొని సుకపడ్లేనే."

సాయమ్మ చుక్కమ్మను వదలించుకొని ఆమెను తేరపార జూసింది. నిండు యౌవనంతో నవ నవలాడుతూ ఉంది. చెంపకు చేరదేసి కళ్ళు. పేద దుస్తుల్లో ఉన్నా కళ్ళుచెదిరిపోయే అందం. 'ఈ పిల్లకోసం అందరూ ఎగబడతా ఉంటే. ఇది నా కొడుక్కోసం ఎగబడతా ఉంది ఎంతసిత్రం' అనుకొంది.

"అమ్మీ నా తమ్ముడు కూతురుందే. ఆడి మీద ఆస పెట్టుకో ఉంది."

"అయన్నీ నాకేటీ తెలుసు అత్తా. నేను ఈడ్ని పేమించినా. ఈడి తోనే కాపరం సేత్తా."

"ఆ ఆస వదులుకో. జరగనిపని."

"అత్తా నువ్వు కాదంటే ఈడినే సత్తానే" అంటూ సాయమ్మ కాళ్ళమీద పడింది.

"సావడం ఎందుకులేయే. పెద్దోళ్ళతో మాట్లాడతంలే నువ్వేల్లు" అన్నాడు అంతవరకూ జరిగేది చూస్తున్న బాలయ్య ఇక ఊరుకోలేక.

సాయమ్మ వైపు ఆశగా చూసింది చుక్కమ్మ. సాయమ్మ మనసు అదోలా అయిపోయింది. 'సరేలే' అన్నట్లు తల ఊపింది సాయమ్మ. అదే పదివేలనుకొని సంతోషించి వెళ్ళిపోయింది చుక్కమ్మ.

ఆ రాత్రి బాగా పొద్దుపోయిం తర్వాత నక్కుతూ, నసుగుతూ వచ్చాడు నాగయ్య. ఆ మధ్యాహ్నం మామిడితోపులో కలుసుకొని సరసాలాడుకొన్నప్పుడు చుక్కమ్మకు అన్నీ చెప్పి పంపింది తన కొడుకేనని సాయమ్మకు తెలియదు.

"ఏందిరా అబ్బి. ఇంత పొద్దుబోయి వచ్చినవు. యాడికెళ్ళినవో నని మీ నాయన ఎతకనుబోయిండు."

నాగయ్య మారు మాట్లాడకుండా పొయ్యి ముందు కూర్చొని పొయ్యిలోకి పుల్లల్ని ఎగదోయ సాగాడు. పొయ్యిమీద అడవిదుంపలు ఉడుకుతూ ఉన్నాయి. వాటిని రాత్రిపూట చిరుతిండిగా వాడుకొంటారు వాళ్ళు.

"ఏందిరా మాటాడవు అడగతుంటే" ప్రేమగా గద్దించింది.

"మనసు బాగలేక ఊరవతల పెద్ద మర్రిమాను దగ్గర కూసొండి పోనానే."

"యాందిరో పెద్దోడివయిపోయినవే. మనసు బాగలేగ మర్రి మాను దగ్గర కూసొన్నడంట మొనగాడు. లెయ్ పొద్దు బోయింది. కూడు తిందువుగాని."

"నాకు కూడొద్దే" అంటూ లేచి మంచానికి అడ్డం పడుకొన్నాడు.

"ఏందిరా నీ మనసులో ఉండేది సెప్పు"

"నా మనసులో ఉండేది సుక్కే. అది లేకపోతే నేను సత్తానే" అంటూ బోర్లా తిరిగి పడుకొన్నాడు నాగయ్య

"ఆ...అంత మనసయిందా నీకు. అయినా దాని కూడొదంట్రా నీమీద ప్రేమ"

"ఎందుకు లేదే. నేసేసుకోకపోతే సత్తానని కాళ్ళు పెనేసుకొని ఏడ్చింది" గర్వంగా చెప్పాడు నాగయ్య.

ఇంతలో బయట అడుగుల చప్పుడయింది. సాయమ్మ గుడిసె బయటికొచ్చింది. ఎదురుగా బాలయ్య. మొగుడితో గుసగుస మాట్లాడింది.

"ఒంటిబిడ్డ. వాడిష్టపెకారం సేద్దమే. వాడేమైనా గోరంసేసుకొంటే మనం సూడ్లేం" అంది. దానికి సరేఅన్నాడు బాలయ్య. సాయమ్మ మాటకు ఎదురు చెప్పి అతనెరుగడు ఆమెకూడా అంతే

అంగీకారం కుదరడంతో పెళ్ళి రాయబారాలు మొదలయ్యాయి. ఆ ఆనందంలో ఆకాశంలో ఒదుక్కున్న మేఘంలా చుక్కమ్మ, నాగయ్య కౌగిలిలో కూరుకొని కిలకిల వానేది.

కొడుకు పెళ్ళయి ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత చనిపోయాడు.

బాలయ్య. భర్త చనిపోయిన తర్వాత మరీ ఒంటరిదై పోయింది సాయమ్మ. శక్తి ఉన్నంతవరకు అడవిలోకి పోయి కట్టెపుల్లలు ఏరుకొని వచ్చి కుటుంబానికి సాయపడేది. ఇప్పుడు వృద్ధాప్యం వచ్చేసి చూపు కూడా మందగించడంతో ఏ పని చేయలేక పోతోంది.

తనెంతో గారాబంగా పెంచిన కొడుకు, అభిమానంగా చూసు కొన్న కోడలు మధ్య తన గురించి ఇలాంటి సంభాషణ జరిగే సరికి సాయమ్మ ముసలిగుండె తట్టుకోలేక పోయింది తెల్లవార్లూ కలతనిద్రతో గడిపింది. మనసును బండరాయిలా మార్చుకొంది. ఉదయాన్నే కొడుకు ముఖం చాటేసి తిరుగుతూంటే పిలిచింది. వాడికి తనమీదుండే ప్రేమ తనకు తెలుసు.

"వొరే నాయనా! సంకురాతిరి పండగనుంచి నాను ఏరేగా బతక తన్రా" అనలేక అంది. ఆ మాటంటూంటే మనిషి నిలువెల్లా కదిలి పోయింది.

"వుప్పుడెవురే మన్నరే"

"వొవురేమనక పోయినా నానట్టా అనుకొన్నా. ఈ నాల్రోజులు మీ దగ్గరుంటా" అని ఇటు తిరిగింది.

అంతవరకూ ఆనందంగా చూస్తున్న చుక్కమ్మ తను విననట్లే గుడ్డలు ఉతుక్కో సాగింది తల తిప్పి.

ఆ ఉదయం ఆఖరి సారిగా కోడలు పోసిన గంజి త్రాగుతూంటే ఆమెకు తెలియకుండానే రెండు కన్నీటి చుక్కలు గంజిలో రాలాయి.

సాయమ్మ తన పాతగుడ్డలమూట. కర్ర, అడుక్కొనేందుకు సత్తుపాత్ర తీసుకొని ఊరవతల మర్రిమాను దగ్గరకు చేర్చింది. ఊరవ తల మర్రిమాను వెలివేసిన అడజుట్టు విరబోసుకొని కూర్చొన్నట్లుంది.

సాయమ్మ గుడ్డలమూట చెట్టు మొదట్లో పెట్టి, మనవడు తెచ్చి ఇచ్చిన చింకిచాప పరచుకొంది. గుడ్డల మూటమీద తలపెట్టి, చింకిచాప మీద పడుకొంది. ఆమె ఆలోచనలతో కాలిపోతూంటే గాలి చల్లగా వీస్తోంది.

"ఆరి సాయమ్మ ఈడుందదేంది. అలిగొచ్చిందా ఏంటి?" అంటున్నారు ఆ దారిన పనులకు వెల్తున్నవాళ్ళు.

"అలిగి రావడం కాదు. దాన్ని కోడలు బయటకు తరిమేసింది. ఊర్లబోయి బతకమని అన్నారు తెలిసినవాళ్ళు.

"దానికి సిగ్గులేకపోతే ఆడికెట్టా సిగ్గులేదు. బుద్ధిలేని నాయాలు" మగవాళ్ళు నాగయ్యను తిడుతున్నారు.

సాయమ్మకు గుబులు గుబులుగా, సిగ్గుగా, కొత్తగా ఉంది. ఎంతమంది ఎన్నను కొంటున్నా మాట్లాడకుండా పడుకొంది. కొంతమంది ఏదో జాలి చూపించి మాట్లాడబోతే సాయమ్మ మాట్లాడలేదు. దాంతో ఊరుకొన్నారు.

ఆ రోజంతా సాయమ్మ ఎక్కడికీ పోలేదు. పస్తు పడుకొంది. చీకటి పడింది. గుడ్లగూబలు వికృతంగా అరుస్తున్నాయి. మర్రిచెట్టుమీద రకరకాల పక్షులు వింత ధ్వనులు చేస్తున్నాయి. మొదట భయపడిన సాయమ్మ తను ఏ విధంగానయినా చచ్చిపోతే బాగుణ్ను అనుకొంది. అందుకే భయం లేకుండా నిద్రపోయింది.

మరుసటిరోజు ఉదయం పొలాలకు చద్దన్నం తీసుకువెల్తున్న కొందరు చూశ్ళేక ముసలిదాని సత్తు గిన్నెలో గంజి పోసారు. అది తాగింది. ఇలా ఎవరయినా పోస్తే తాగడం, లేకపోతే పస్తుండడం ఇలా రోజులు గడప సాగింది. ఇంత జరుగుతున్నా ఆ పరిసరాలకు నాగయ్య రాలేదు, భార్య ఆంక్షలకు బద్ధుడై.

గూడెం వదలివచ్చి పది రోజులయింది. రెండురోజులనుంచిపస్తు. గూడెంలో వాళ్ళు కూడా తనను పట్టించుకోవడం మానేసారు. ఇక తప్పని సరి పరిస్థితుల్లో కర్ర తీసుకొని అరమైలు దూరంలో ఉన్న ఊరివైపు అడుక్కోనేందుకు బయలు దేరింది. పదడుగులు వేసిందో లేదో ఇప్పు డిలా బోర్లా పడింది.

• • • •

ఏడుపు ఆపి పైట చెంగుతో కళ్ళు తుడుచుకొని మెల్లగా లేచి నిల బడింది. ఊరివైపు అడుగులు వేసింది. అడుక్కోవడం క్రొత్త. అడు క్కోవడం నామోషీ కాకపోయినా అడుక్కోవడం చేతకావడంలేదు. ఇంటి ముందు నిలబడడం. వాళ్ళు వేస్తే వేయించుకోవడం లేకపోతే పోతూ ఉండడం. సాయమ్మ అందరికీ తెలిసింది కావడంచేత తమకు తోచింది వేస్తున్నారు.

సాయమ్మ మర్రిచెట్టు చేరుకొని తను మధ్యాహ్నం తినగా మిగి లింది రాత్రికి దాచుకొంది. చెట్టుమీద స్వేచ్ఛగా జీవించే పక్షుల్ని తలచు కొంటే హాయిగా ఉంది ఆమెకు అవే ఆమె కిప్పుడు ఆప్తులు. తోడు నీడా.

ప్రొద్దుకుంకే ముందుగా తను దాచుకొన్న అన్నం తినేసింది. చింకిచాప పరచుకొని కళ్ళు మూసింది. అర్ధరాత్రి హోరుమనే గాలి శబ్దా నికి పైనుంచిపడే చినుకులకు మెలుకువ వచ్చింది ముసలి సాయమ్మకు. చుట్టూ నీళ్ళే పైనున్న చెట్ల ఆకులలోంచి నీటిబొట్లు ధారగా కారు తున్నాయి. సాయమ్మ భయం భయంగా తన పాత గుడ్డల మూటను చంకలో వేసుకుంది. దారి తెన్ను తెలియలా. గూడెంలోకి పోవాలంటే ఫర్లాంగుదూరం, వూళ్ళోకి పోవాలంటే నాలుగు ఫర్లాంగులు. సాయమ్మ దిక్కు తెలియక మర్రిచెట్టు మొదట్లో చేరి చెట్టును తడమ సాగింది.

ఆమెకు విశాలంగా వున్న తొర్ర ఒకవైపు కనిపించింది. అందులో దూరింది. ఆ తొర్రలో ఏవయినా విషసర్పాలున్నాయేమోనని కూడా ఆమె ఆలోచించలేదు

రాత్రంతా జోరున వర్షం. ఆ తొర్రలోనే ముడుచుకు కూర్చుంది. వర్షం తగ్గిపోయినా సాయమ్మ బయటికి రాలేదు. ఆ దారిన పోయే జనం ముసలిది చచ్చిపోయిందనుకున్నారు ఆ విషయం ఆమె కొడుక్కి చెప్పారు. తరువాత కొడుకేం పట్టించుకోనపుడు మనకెందుకులే అని ఊరు కున్నారు. రెండురోజులకు సాయమ్మ తొర్రలోంచి ఇవతలికి వచ్చింది.

కొద్దిగా ఆరిన ప్రదేశంలో ముడుచుకు కూర్చుంది. జ్వరంతో ఆమె శరీరం కాలిపోతూ వుంది. ఆరోజే కలెక్టర్‌గారు గూడెం క్యాంపు. రెండ్రోజుల క్రితం కురిసిన భారీవర్షానికి గూడెంలో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి వస్తున్నారు. కలెక్టర్‌గారి కారు ఊరివరకూ వచ్చి ఆగిపోయింది. ముందు బంట్రోతు నడుస్తుంటే, వెనుకనే వస్తున్నారు కలెక్టర్‌గారు. ఆయన ప్రక్కన మిగతా అధికార్లు.

మర్రిమాను దగ్గరికి వచ్చేసరికి కొందరు ముసలిదాన్ని బలవంతంగా లేపి ఒకవైపుకు ఈడ్చుకు పోసాగారు.

"ఆగండి" అన్నారు కలెక్టర్‌గారు.

ముసలిదాన్ని ఆపారు.

సాయమ్మ కలెక్టర్‌గారి దృష్టిలో పడడంతో ఆమెను గురించి పూర్తిగా విచారించారు. కలెక్టర్‌గారు ఆమెకు వృద్ధాప్యపు పెన్షన్ ఇస్తానన్నారు కాలనీలో అందరితోపాటు ఆమెకూ ఇల్లు కట్టిస్తామన్నారు. తక్షణ కర్తవ్యంగా ఆమెను హాస్పిటల్‌కు పంపే ఏర్పాటు చేశారు

కాని అప్పటికే రక్షణలేక రెపరెప కొట్టుకుంటున్న గుడ్డి దీపం ఆరిపోయింది. తనకు ఎవరి సహాయమూ అక్కరలేదనుకొంటూ ఆమె ప్రాణం గాలిలో కలిసిపోయింది.

చివరకు ఆమె శవం కూడా నాగయ్య, చుక్కమ్మల సాయం అందుకోకుండా ప్రభుత్వంవాళ్ళ చేతుల్లోనే దహనమయింది.

*